# ఓగు

నూాట నలభయి  ఎనిమిదో నెంబరు గది ముందు ఆగాను. నడవలో ఎవరూ లేరు. తలుపు తడుతుంటే నా గుండె వేగంగా కొట్టుకోవటం  మొదలెట్టింది.

నన్ను చూసి నరహరి తప్పక ఆశ్చర్యపోతాడు. నేను అతని జ్ఞాపకాల్లోంచి తొలగిపోయి ఉండను. అతను నన్ను వదిలి వెళ్ళిన తర్వాత ఏ నుయ్యో, గొయ్యో చూసుకునే పిరికిదాన్ని కానని అతనికి తెలుసు. అతన్ని చూసి ఆరు సంవత్సరాలవుతోంది. అతన్ని మళ్లీ చూడబోవటం జరుగుతుందని నేను అనుకోలేదు. నాకు అతను గుర్తురాని రోజు ఉండదు. అతనంటే ప్రేమని కాదు. నా జీవితం ఇంత అస్తవ్యస్థం కావటానికి కారణం అతనే!

నుదుటికి పట్టిన చెమటను రుమాలుతో అద్దుకున్నాను. నా గుండె కొట్టుకునే చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తోంది. తలుపు మళ్లీ తట్టబోయేంతలో శబ్దం కాకుండా తలుపు తెరుచుకునేసరికి గుండె ఝల్లుమంది. ఎదురుగా నరహరి  నిలబడి ఉన్నాడు. చెంపల పైన జుట్టు నెరసింది. ముందరి జుట్టు ఊడి బట్టతల అయింది. మా ఊరి నుండి నన్ను తీసుకువచ్చిన నాటికే అతని వయసు  నలభై ఉంటుంది. నాకంటే ఇరవై సంవత్సరాలు పెద్దవాడు. చూడటానికి  అలా అవుపించడు. పదేళ్ళు చిన్నగా కనిపిస్తుంటాడు. పూల లుంగీ కట్టుకుని ఉన్నాడు. భుజం మీద గోధుమరంగు తువ్వాలు ఉంది. మెడలో బంగారపు గొలుసు ఉంది. ఛాతీమీద వెంట్రుకలు దట్టంగా  ఉన్నాయి.

చేతులు జోడించి, “నమస్తే” అన్నాను. ప్రతినమస్కారం చేశాడు కాని నా ఊహకు భిన్నంగా నన్ను గుర్తుపట్టినట్లు లేదు. అతని జ్ఞాపకాల్లోంచి తొలిగిపోయి నట్టున్నాను. “నేను.... భానుమతిని” అన్నాను.

“భానుమతి... వెల్.... నాకు ఎంత ఆశ్చర్యంగా ఉందో తెలుసా? రా.. లోపలికి రా” తలుపు తెరిచి గుమ్మానికి అడ్డం తొలిగాడు. లోపలికి నడిచాను. గది చల్లగా ఉంది.

“కూర్చో.”

టీపాయ్ మీద హేండ్‌బేగ్ పెట్టి సోఫాలో కూర్చున్నాను. “ముందు నన్ను గుర్తుపట్టలేదు కదూ?” నవ్వుతూ అడిగాను. అప్పట్లో నా నవ్వంటే చాలా ఇష్టమనేవాడు.

"అవును, నువ్వు చాలా మారిపోయావు. మునుపటి కన్నా అందంగా ఉన్నావు. కొద్దిగా లావెక్కావు" తలుపు వేశాడు. నా ఎదురుగా ఉన్న మరోసోఫాలో కూర్చుని, "నువ్వు నన్ను నమ్ముతావో, నమ్మవో కాని నువ్వు నాకు గుర్తు రాని రోజు ఉండదు. నీకు నేను చాలా అన్యాయం చేశాను. ఆ అన్యాయం గుర్తు వచ్చినప్పుడల్లా నేనెంత బాధపడుతుంటానో నీకు ఎలా చెప్పాలో నాకు అర్థం కావటం లేదు..... " ఆగి నా కళ్ళల్లోకి చూశాడు. అతని మాటలు తీయగా ఉంటాయి. అబద్ధం చెబుతున్నట్లు అనిపించదు. తన మాటలతో ఎంతటి వాడినయినా బోల్తా కొట్టించగలడు. అంచాతే చాలా ఎదిగిపోయాడు. "కాఫీ తెప్పించేదా? ఈ హోటల్లో కాఫీ చాలా బావుంటుంది." అన్నాడు.

తల అడ్డంగా ఆడించి, "వద్దు, ఇంట్లోంచి బయల్దేరే ముందే కాఫీ తాగి వచ్చాను" అన్నాను.

"ఎక్కడ ఉంటున్నావు?"

"బంజారా హిల్స్‌లో."

"వెల్, సొంత ఇల్లేగా?"

"మరి?"

"వెరీగుడ్. పెళ్లి అయిందా?"

"అయింది."

"శ్రీవారు ఏం చేస్తుంటారు?"

"ఆయనకు బాలానగర్‌లో స్టీలు ఫేక్టరీ ఉంది."

"పిల్లలెంతమంది?"

"ఇంకాలేరు."

"వద్దా?"

"అప్పుడే?"

"పెళ్ళయి ఎంత కాలమయింది?"

"మూడు సంవత్సరాలు దాటాయి."

"ఈ మధ్యలో కాకినాడ ఎప్పుడయినా వెళ్లావా?"

"లేదు. నువ్వో?"

"నాలుగయిదు సార్లు వెళ్లాను."

"మా నాన్నగారు చనిపోయారు."

"విన్నాను."

"మా అమ్మగారికి పక్షవాతం వచ్చింది."

"ఈ సంగతి నాకు తెలియదు. ఇప్పుడావిడ నీ దగ్గిర ఉంటోందా?"

"లేదు. కాకినాడలో తమ్ముడి దగ్గర ఉంటోంది. తమ్ముడు అక్కడ టీచరుగా పనిచేస్తున్నాడు." ఆగాను. అన్నయ్య సంగతి చెప్పదల్చుకోలేదు. నా చావుకు ఎవరూ బాధ్యులు కారని రాసి ఆత్మహత్య చేసుకున్న కారణాన్ని నేనే! నా అవివేకం వలన నా జీవితం, మా వాళ్ల జీవితాలు నాశనం చేశాను. తలెత్తుకు తిరగలేని పరిస్థితులు కల్పించాను. వాళ్ల ఉసురు నాకు తగులుతోంది. నేను ఎక్కడున్నానో వాళ్లకు తెలియదు. నాకు అన్యాయం చేశాననే గిల్టీ ఫీలింగు అతని ముఖంలో ఏ మూలా కనబడటం లేదు. ఒక్క ఓదార్పు మాట అతని నోట నుండి బయటకు రాలేదు. తువ్వాలుతో బట్టతల తుడుచుకుని, "ఇప్పుడు.... యు ఆర్ బెటర్ నౌ" అన్నాడు.

"అవును. మచ్ బెటర్" అని లేచి నిలబడ్డాను. అప్పట్లో ఇంత ఆత్మధైర్యం నాకుండేది కాదు. చేతిగడియారం వంక చూసుకున్నాను. నాలుగూ ఇరవయి అయింది. "ఈ రోజు వార్తాపత్రికలో నీ ఫోటో, కచేరి ఉంటుందని చదివిన తర్వాత నిన్ను చూడాలనిపించింది. గప్‌చిప్‌గా ఇక్కడకు వచ్చేశాను. చాలారోజుల తర్వాత నిన్ను చూసినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఈ రాత్రి ఎనిమిది గంటలకు రవీంద్రభారతిలో జరిగే కచేరికి, సన్మానకార్యక్రమానికి నేనూ, మా ఆయన తప్పకుండా వస్తాం. మా ఆయన శాస్త్రీయ సంగీతమంటే చెవికోసుకుంటాడు. ఆ తర్వాత మళ్లీ నీకు కనిపించను" అన్నాను.

"మీ ఆయనకు నన్నేమని పరిచయం చేస్తావు?"

"కాకినాడలో మా ఇంటి పక్కన ఉండేవాడివని చెప్తాను".

"మీ ఇంటి ఫోనునెంబరు, అడ్రసు...."

"ఏమనుకోకు. చెప్పను."

"హైదరాబాద్ వచ్చినప్పుడు నిన్ను ఎప్పుడయినా కలుసుకోవాలంటే ఎలా?"

"చెప్పానుగా, మళ్లీ కనిపించనని."

"ఈ ఎంట్రీపాసులు తీసుకెళ్లు. ఇవి లేనిదే లోపలకు రానీయరు" బల్లమీదున్న పాస్‌ల్లో రెండు తీసి నా కందించి నా దగ్గిరగా వచ్చాడు. అతని చేతులు నానడుంమీద

పడ్డాయి. మనిషి ఇంత ఎదిగినా మారలేదు. అతని చేతులు వేడిగా ఉన్నాయి. నన్ను దగ్గిరకు తీసుకోబోతోంటే, "వద్దు. రేపిక్కడే ఉంటావుగా. వీలుచూసుకుని ఉదయం పది, పదిన్నర మధ్య వస్తాను" అని దూరంగా జరిగాను. అది కాని పని.

ఎనిమిది కావస్తుండగా రవీంద్రభారతి చేరుకున్నాను. ఎనిమిదిన్నరకు కార్యక్రమం మొదలయింది. సన్మానం ముగిసిన వెంటనే కచేరి మొదలవబోతోంటే స్టేజిమీద కొచ్చాను. తెర తీయలేదు. బల్లలు, కుర్చీలు తీసి కచేరికి స్టేజి సిద్ధం చేస్తున్నారు. "ఎంత సేపయింది వచ్చి?" అడిగాడు నన్ను చూడగానే.

"ఎనిమిదింటికి వచ్చాను. సన్మానం ఘనంగా జరిగింది. కంగ్రాచ్యులేషన్స్."

"మీ ఆయనేడి?"

"రాలేదు. నేనొక్కదాన్నే వచ్చాను." అంటుంటే నా కుడిచేయి అందుకుని అరచేతిలో గిచ్చాడు.

"నాకో సహాయం చేసిపెట్టాలి."

"చెప్పు."

"అదో ఆ మూల ఉన్న స్టూలు మీది పెద్ద ఫ్లాస్కు ఉంది కదా, దాన్నిండా పాలు ఉన్నాయి. స్టూలు పక్కనే ఉన్న ప్లాస్టిక్ సంచిలో కప్పూ, సాసరు ఉన్నాయి. వాటిని శుభ్రంగా కడిగి పాలు పోసి ఇవ్వగలవా?"

"తప్పకుండా" అని స్టూలు పక్కనే ఉన్న ప్లాస్టిక్ సంచిలోంచి కప్పు, సాసరు బయటకు తీస్తూ నరహరి ఉన్న వైపు చూశాను. నరహరి దృష్టి నామీద లేదు. స్టేజి మీద ఏవి ఎక్కడ ఉండాలో అక్కడున్న వాళ్లకు చెబుతున్నాడు. కప్పూ, సాసరు కడగటానికి వాష్‌బేసిన్ దగ్గిరకు నడిచాను. అక్కడ ఎవరూ లేరు. నాకీ అవకాశం వస్తుందని నేను అనుకోలేదు. రాకపోయినా ఏదో విధంగా పని ముగించేదాన్ని. వాష్‌బేసిన్‌లో కప్పూ, సాసరు కడిగి నా హేండ్‌బాగ్ లోంచి చిన్న సీసా బయటకు తీసి మూడు చుక్కల మందు కప్పులో వేసి సీసాను హేండ్‌బేగ్‌లో పెట్టి చేతులు శుభ్రంగా కడుక్కుని రుమాలతో తడుచుకుంటుంటే నా చేతులు చిన్నగా వణకటం గమనించాను. నా జీవితంలో ఇది రెండో సాహసం. మొదటిది నరహరితో వచ్చేయటం. స్టేజిమీదకు వచ్చి, ఫ్లాస్కు అందుకుని నరహరి ముందే పాలు కప్పులోకి వంపి అందించాను.

నిమిషంలో కప్పు ఖాళీచేసి నాకు అందించాడు. కప్పూ, సాసరు శుభ్రంగా కడిగి ప్లాస్టిక్ సంచిలో పెట్టాను. నేను వచ్చిన పని అయిపోయింది. కొద్దిసేపట్లో తెరతీస్తారనగా, "నేను హాల్లో కొద్దిసేపు కూర్చుని వెళ్ళిపోతాను" అన్నాను.

"కచేరీ అయిపోయేవరకు ఉండకూడదూ?"

"రేపు ఉదయం హోటలుకు వస్తాను. ఎక్కడికీ పోకు."

"పోను. నీ కోసమే ఎదురుచూస్తూ ఉంటాను."

అతని ముఖంలోకి జాలిగా చూశాను. అరగంట తర్వాత అతని పరిస్థితి ఎలా ఉంటుందో నేను ఊహించగలను. వెళ్తున్నట్టు తలూపి వెనకనుండి స్టేజిదిగాను. తెరలేచాక వినాయకుడి ప్రార్ధనతో కచేరి మొదలయింది.

పావుగంట తర్వాత పొడిగా మొదలయిన దగ్గు మరో అయిదు నిమిషాలకు నరహరిని గుక్క తిప్పుకోనీయలేదు. లేచి బయటకు వస్తూ ఒక్కక్షణం పాటు తలుపు దగ్గిర ఆగి స్టేజివైపు చూశాను. మరో పావుగంటకు అతను రక్తం కక్కుకుంటాడు. ఆ తర్వాత అతని కంఠస్వరం ఎవరికీ వినిపించదు. తలుపు తెరుచుకుని బయటకు వచ్చాను.

రోడ్డు మీదకు వచ్చి ఖాళీ ఆటో ఆపి ఎక్కి కూర్చుని ఎక్కడికి వెళ్లాలో చెప్పాను. నిజానికి అది నేను వెళ్ళవలసిన చోటు కాదు. అక్కడ మరో ఆటో మాట్లాడుకోవాలి. సచివాలయం దాటాక హేండ్‌బేగ్ లోంచి చిన్న సీసా బయటకు తీశాను. కొద్దిసేపు అలానే పట్టుకుని టేంక్‌బండ్ మీదకు రాగానే సీసా బయటకు విసిరి సీటుకు చేరగిలబడి కూర్చున్నాను. నేను చెప్పినవన్నీ అబద్ధాలు. నేనింతకు ఒడికడ్తానని అతను ఊహించి ఉండడు. భ్రమలోంచి ఊబిలోకి జారిన నేనూ అనుకోలేదు.

◆ విజయ, మాసపత్రిక - మే- 1983